పింఛను ఎకరంన్నర భూమి కౌలుకు సమానం

- వైఎస్సార్ పింఛను కానుక పెంపు, కొత్త పింఛన్ల మంజూరు సభలో ఎమ్మెల్యే శివకుమార్
- పట్టణంలో 15,759 మందికి రూ.4.74 కోట్ల చెక్కు అందజేత



రూ.4.74 కోట్ల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఎకరాకు రూ.18 వేల నుంచి రూ.24 వేల వరకు కౌలు రేటు ఉన్న నేటిరోజుల్లో నెలకు రూ.3 వేల పింఛను వంతున ఏడాదికి రూ.36 వేలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు ఎకరంన్నర భూమిని అప్పగించినట్టేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల పేరుతో కౌలుదారుడు ఇచ్చే మొత్తంలో కోత పెట్టొచ్చుగాని, ప్రభుత్వం ఇచ్చే పింఛనులో రూపాయి కూడా తగ్గించకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచనుగా వలంటీర్లతో ఇంటి వద్దే అందజేస్తున్నారని గుర్తుచేశారు. అవ్వాతాతలకు పింఛను గ్యారెంటీతో ఒక పెద్దకొడుకులా తోడునీడగా ఉంటున్న ముఖ్యమంత్రిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని కోరారు.

■ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో వైఎస్సార్ పింఛను కానుక ప్రతినెలా రూ.3 వేలు, కొత్తగా మంజూరైన 177 మందికి పింఛన్ల పంపిణీని గురువారం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. పట్టణంలో మొత్తం 15,759 మందికి జనవరి నెల పింఛను మొత్తం రూ.4.74 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. సభకు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు గతంలో ఏ పార్టీకైనా ఓటు వేసి ఉండొచ్చుగానీ, అర్హత ఉన్న అందరికీ పింఛనుతో సహా అన్ని సంక్షేమ పథకాల్లో రూ.2.82 లక్షల కోట్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు గుర్తుచేశారు. రాష్ట్రంలో 85 శాతం కుటుంబాలకు సంక్షేమ లబ్ధిని అందించిన ముఖ్యమంత్రి ఒకపక్క, 15 శాతం ప్రజలకోసం ఇద్దరు నాయకులు మరోపక్క ఉన్నారని ప్రతిపక్ష నేతల నుద్దేశించి అన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచేందుకు తీసుకొచ్చిన సంస్కరణలే సంక్షేమ పథకాలన్నారు. టీడీపీ హయాంలో తెనాలి పట్టణంలో 8,632 మందికి పింఛన్లు ఇస్తే, ఇప్పుడు 15,759 మందికి ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలో గతంలో 21 వేలమందికి పింఛన్లు ఇస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 37 వేల మందికి నెలనెలా రూ.10.86 కోట్లను పింఛను రూపంలో అందజేస్తుందని వివరించారు.

■ ఎవరి డబ్బులు ఇస్తున్నారంటూ ప్రతిపక్షాల వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. మీ హయాంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పెద్ద మనసు ఉన్నందునే ఇంతగా పేదలు, మధ్యతరగతి వర్గాలు, అగ్రవర్ణాల్లోని పేదలను ఆదుకుంటున్నారని ఇలాంటి ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మీదేనని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికరమేష్ మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, గరిష్ఠంగా సంక్షేమ లబ్ధిని కల్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్‌ను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు జి.మానసారెడ్డి, కొత్ర యశోద, షేక్ దుబాయ్‌బాబు, గొడవర్తి సాయిహరేరామ్, పార్టీ నేత తిరుమలశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు వంపుగళ్ల కృష్ణ, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, దాసరి వీరవసంతరావు, ఆవుల కోటయ్య, యాతాటి అనిల్, పార్టీ నేతలు కఠారి హరీష్, పెదలంక వెంకటేశ్వరరావు, బచ్చు రాఘవరావు పాల్గొన్నారు.

సంక్షేమంతో పేదలకు ఆర్థిక భరోసా

తెనాలి: పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసానివ్వటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. రూరల్ మండలం పరిధిలో వైఎస్సార్ పింఛను కానుక ప్రతినెలా రూ.3 వేలు, కొత్తగా మంజూరైన 228 మందికి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆయన ప్రారంభించారు. మొత్తం 11,190 మందికి జనవరి నెల పింఛను మొత్తం రూ.3.32 కోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సభకు ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ నెలనెలా పింఛన్లకు ఇస్తున్న రూ.1900 కోట్లతో రోడ్లు వేయొచ్చు కదా అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని కానీ పేదవాడు రెండుపూటలా తినగలిగేలా చూడటం ముఖ్యమన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాలను అధికారంలోకి వచ్చాక తూచ తప్పక అమలుచేస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ఎన్నికల హామీలను నిలుపుకోనివారు, ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక, ఆరు గ్యారెంటీలు, ఉచిత సిలెండర్లు అంటూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమాన్ని కచ్చితంగా అమలుచేసినట్టు చెప్పారు. నందివెలుగు–వీఎస్సార్ కాలేజి మధ్య రోడ్డు బాగోలేదన్నది నిజమేనని.. తొందర్లోనే వేస్తామని చెప్పారు. సంక్షేమంతో 85 శాతం ప్రజల వెంట ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కారుమంచి కిషోర్‌బాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ముప్పవరపు సంధ్యారాణి, తిన్నలూరి విజయలక్ష్మి, కాజ భద్రావతి, కోపల్లె మణిమ్మ, షేక్ ఇలియాజ్, చింతల కుమారి, కాకి రమాదేవి, కుంభం బాలాజీ, బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 16వ వార్డులో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 16వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 16వ వార్డు ముత్తెంశెట్టిపాలెంలోని సచివాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సచివాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

తెనాలి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా జశ్వంత్



తెనాలిఅర్బన్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగ తెనాలి మండల అధ్యక్షునిగా కుర్రా జశ్వంత్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ గురువారం నియామక ఉత్తర్వులు పంపారు. ఇప్పటి వరకు యువజన విభాగ అధ్యక్షునిగా పనిచేసిన వేముల మహేష్‌ను జిల్లా యువజన విభాగ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి నియామకం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పాస్టర్‌లకు నూతన వస్త్రాలు పంపిణీ



తెనాలిఅర్బన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బిషప్ గద్దం సాధు థామస్ జూనియర్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని గద్దం థామస్ కాంపౌండ్‌లో జనవరి పండుగను నిర్వహించారు. 100మంది దైవ సేవకులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గద్దం సన్నీ డానియేల్, ఆలూరి నాంచారయ్య, చొప్పర నాగేందర్, పీటర్ డానియేల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గురువులే మార్గదర్శకులు



ఫిరంగిపురం: విద్యార్థులకు ఉపాధ్యాయులే క్రమశిక్షణతో కూడిన దిశానిర్దేశం చేస్తారని హెచ్‌ఎం సిస్టర్ థెరసమ్మ అన్నారు. సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు పీవీ పద్మావతికి గురువారం సన్మానం నిర్వహించారు. సిస్టర్ థెరసమ్మ మాట్లాడుతూ పద్మావతి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో సిస్టర్లు ఆరోగ్యమేరి, ఇగ్నేషియస్, విన్సీ, మరియరాణి, షీలా, పీఈటీ ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధికి భవానీలు

ఫిరంగిపురం: మండల దీక్ష తరువాత భవానీ మాలధారులు విజయవాడ కనకదుర్గమ్మ చెంతకు బయలు దేరారు. వేములూరిపాడులో 41 రోజులుగా మండల దీక్ష చేసిన భవానీ మాలధారులు గురువారం జలపాలేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ఉమాపతిశాస్త్రి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. గురుస్వామి పూర్ణచంద్రరావు మాలధారులకు ఇరుముడి అందజేశారు. అనంతరం వారు విజయవాడ దుర్గమ్మ సన్నిధికి కాలినడకన బయలు దేరివెళ్లారు.

సచివాలయానికి తాగునీటి ప్యూరిఫయర్

మేడికొండూరు: డోకిపర్రు గ్రామంలో ఇటీవల కొత్తగా సచివాలయం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు, సచివాలయ సిబ్బంది సౌకర్యార్థం సచివాలయంలో రూ. 20వేలు ఖరీదు చేసే మంచినీటి ప్యూరిఫయర్‌ను గ్రామ ఉపసర్పంచ్ షేక్ జానీబాషా గురువారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, గ్రామ సర్పంచ్ కొండెపోగు సాంబ్రాజ్యం, పంచాయతీ సెక్రటరీ బి.రమేష్, విద్యా కమిటి చైర్మన్ ఉడతా ప్రభాకర్, దివ్య, శరవాణి, యెలిషాబాబు, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం పోటీలకు హాజరై వివిధ విభాగాల్లో బహుమతులు పొందిన పెనుమాక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణచంద్రశేఖరరావు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి బాలోత్సవాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. తమ పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు బాలోత్సవంలో బహుమతులు పొందారని వివరించారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.ఎం.సుభాని, కో– ఆప్షన్ సభ్యులు బొక్కా నాని, పాఠశాల సహ ఉపాధ్యాయులు చింతపల్లి రాధాకృష్ణ, సరికొండ సత్యనారాయణరాజు, రావెళ్ళ శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.రమేష్, ఎన్.శ్రీదేవి, లలిత కుమారి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్



వైద్యులు, ఆపరేషన్ చేయించుకున్నవారితో డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ మూడో యూనిట్ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు ఆయన వెల్లడించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం ఆర్‌కేజీ పాలెంకు చెందిన వెంకట నరసమ్మ గత రెండు నెలల నుంచి కామెర్ల వ్యాధితో బాధ పడుతుంది. చికిత్స కోసం 2023 నవంబర్‌లో జీజీహెచ్ వచ్చింది. జనరల్ మెడిసిన్ వైద్యులు పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి పంపించారు. వారు రోగి కామెర్ల వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించి వ్యాధి తీవ్రతను బట్టి స్టెంట్ వేశారు. స్టెంట్ వేస్తున్న సమయంలో ఎండోస్కోపీలో క్యాన్సర్ గడ్డ ఉందని గుర్తించి జనరల్ సర్జరీ మూడో విభాగానికి రిఫర్ చేసినట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. గతేడాది నవంబర్29వ తేదీన వార్డులో చేర్చుకుని వివిధ పరీక్షలు చేసిన తర్వాత చిన్న పేగులో క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే ఆపరేషన్ చేయాలని నిర్ణయించి గత నెల డిసెంబర్ 20న అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ నాలుగు గంటల్లో చేశామన్నారు. సుమారు రూ.8 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశామన్నారు. ప్యాంక్రియాస్‌కు చిన్న పేగులో క్యాన్సర్ గడ్డ ఉందని గుర్తించి క్యాన్సర్ గడ్డను తొలగించామన్నారు. చిన్నపేగును అతికించిన తర్వాత ఏమాత్రం లీక్ అయినా ప్రాణానికే ముప్పు ఉండేదని, రోగికి కష్టతరమైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేశామని వెల్లడించారు. రోగి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో గురువారం డిశ్చార్జి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటుగా మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవిందా నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఆర్ డాక్టర్ మాధవి, పీజీలు డాక్టర్ సల్మా, డాక్టర్ తన్మయ, డాక్టర్ సందీప్ పాల్గొన్నట్లు వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలో పాల్గొని రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులను డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు. సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: కారు రిపేరు ఆలస్యమైందని అడిగిన వ్యక్తి మీద దాడి చేసి గాయపర్చిన మెకానిక్‌పై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చైతన్య తన కారును రిపేరు నిమిత్తం ప్రియ డీలక్స్ సమీపంలో కార్లు రిపేరు చేసే సోహైల్‌కు సుమారు రెండు నెలల క్రితం ఇచ్చాడు. ఇప్పటికీ కారు సిద్ధం చేయక పోవడంతో తన వద్ద పని చేసే యువకుడు శివను మెకానిక్ వద్దకు బుధవారం పంపాడు. కారు విషయమై మెకానిక్‌ను ప్రశ్నించగా వాగ్వాదం జరగడంతో శివపై రాడ్డుతో సోహైల్ దాడి చేశాడు. గాయపడిన బాధితుడు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అనధికార మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్



తెనాలిరూరల్: బెల్టు షాపు నిర్వాహకురాలిని పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది గురువారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న షేక్ లక్ష్మి నుంచి 10 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మరో ఘటనలో..


తెనాలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని స్థూపం సెంటరుల వద్ద టూ టౌన్ పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి వద్ద 12 క్వార్టరు సీసాలు లభించాయి. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. అతన్ని తెనాలి యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

విశ్రాంత ఉద్యోగి శివరావుకు సేవా స్ఫూర్తి అవార్డు

నగరంపాలెం: వీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ (హైదరాబాద్) 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సేవా స్ఫూర్తి అవార్డుని ప్రకటించినట్లు విశ్రాంత ఉద్యోగి పలకలూరి శివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న హైదరాబాద్ తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సరస్వత్ పరిషత్ భవనంలో అవార్డు ప్రదానం చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. శివరావుకి అవార్డు ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తెనాలి కవికి పడాల రామారావు పురస్కారం

రేపు రాజమహేంద్రవరంలో ప్రదానం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ కవి ఆళ్ల నాగేశ్వరరావుకు మరో పురస్కారం లభించింది. స్వాతంత్ర్యయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు స్మారక పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలో ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజిలో ఈనెల 6న జరగనున్న పడాల రామారావు శతజయంతి ఉత్సవాల్లో ఆళ్ల నాగేశ్వరరావును ఈ పురస్కారంతో సత్కరిస్తారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాల్లో జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా శాఖ బాధ్యులు పాల్గొంటారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న తిన్నలూరి శ్రీనివాసరావు నుంచి ఆరు సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పేద ప్రజలకు భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



పేర్లు నమోదు చేయించుకుంటున్న 28వ వార్డు ప్రజలు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసాను కల్పిస్తుందని 28వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ యాతాటి అనిల్, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను చెంచుపేటలోని రత్నశ్రీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తుందని, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రజలందరూ మెడికల్ క్యాంప్‌లను ఉపయోగించుకోవాలని కోరారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మహిత మాట్లాడుతూ జనరల్ ఓపీ 16, గైనకాలజీ 27, జనరల్ మెడిసన్ 105, ఆప్తామాలజీ 93 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ బి.భవిత సాయి, డాక్టర్ టి.అనిల్, డీపీఎంవో జగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, సూపర్‌వైజర్ మల్లేశ్వరరావు, సచివాలయ అడ్మిన్ టి.సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తుల గుర్తింపు



కొలకలూరులో రాత్రి సమయంలో ఫైలేరియాపై సర్వే నిర్వహిస్తున్న డాక్టర్ సుబ్బారావు, సిబ్బంది

తెనాలిటౌన్: ఫైలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించుటకు రాత్రివేళల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో బుధవారం రాత్రి ఆరోగ్య సిబ్బందితో కలసి 300 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రక్త పరీక్షల ఫలితాల అనంతరం వ్యాధిగ్రస్తులు తెలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నరేంద్ర, సూపర్‌వైజర్ ఎం.వెంకటరెడ్డి, ఏఎన్‌ఎంలు శిరీష, గజలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి గోగినేని సేవలు చిరస్మరణీయం



గోగినేని కనకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

తాడికొండ: విద్యా వ్యాప్తికి గోగినేని కనకయ్య చేసిన సేవలు మరువలేనివని ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల, తెలుగు పండిత శిక్షణ కళాశాల కరస్పాండెంట్ రాయపాటి మోహన సాయికృష్ణ అన్నారు. విద్వాన్ గోగినేని కనకయ్య జయంత్యుత్సవం సందర్భంగా తాడికొండ ఎస్‌వీవీ హైస్కూల్, తెలుగు పండిత శిక్షణ కళాశాలలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గోగినేని కనకయ్య విగ్రహం, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోగినేని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు, హెచ్‌ఎం దేవరాజు, గోపీచంద్, నేతి వెంకట రమణయ్య, మదమంచి చంద్రశేఖర్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరశెట్టి నాగరాజు జ్ఞాపకార్థం దాత డీఎస్‌డీఎల్ నిర్మాణ కంపెనీ ఎండీ డి.సురేష్ బాబు సహకారంతో 20 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు.

వైభవంగా దీపోత్సవం



భక్తిశ్రద్ధలతో దీపోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

నగరంపాలెం: టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ధనురాస్మాన్ని పురస్కరించుకుని గురువారం బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై భక్తి శ్రద్ధలతో దీపోత్సవం నిర్వహించారు. తిరుప్పావై అమతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి తిరుప్పావైలోని 21వ కుత్తువిళక్కు – విశేష పాశురం ప్రవచిస్తూ లోకమంతా జ్ఞాన దీపాలు ప్రకాశించాలని అన్నారు. ధర్మరక్షణలో అందరూ భాగస్వాములై భారతీయ సంస్కృతిని పరిరక్షించాలని పేర్కొన్నారు. తద్వారా భావి తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరూ చేపట్టాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి దీపోత్సవాన్ని ప్రారంభించారు.

అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు

గ్రంథాలయ తనిఖీలో జేసీ జి.రాజకుమారి



పాఠకులతో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాల్లో పాఠకులు కోరిన గ్రంథాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల శాఖ గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో గ్రూప్–1, 2తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు కావాల్సిన పుస్తకాలు, మెటీరియల్స్ పై ఆరా తీశారు. వాటిని అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. సదుపాయాలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులర్‌గా గ్రంథాలయానికి వస్తూ, అవసరమైన పుస్తకాలను కోరినట్లయితే వాటిని సరఫరా చేస్తామని జేసీ చెప్పారు. విద్యార్థులు, గృహిణులు, పోటీ పరీక్షల శిక్షణార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట గ్రంథ పాలకులు శకుంతల, సత్య శిరీష ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గుంటూరు మెడికల్: నిత్యం రోగుల సేవల్లో ఆసుపత్రుల్లో ఉండే వైద్యులు అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం పొందుతారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డులోని కేఎస్‌ఆర్ కాంటినం క్రీడా ప్రాంగణంలో నాలుగోరోజు జరిగిన షటిల్ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం డాక్టర్ ధనుంజయరావు బహుమతులను ప్రదానం చేశారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైద్యుల్లో అంతర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఐఎంఏ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు జరగనున్న ఫైనల్స్ సెమీఫైనల్స్‌లో పాల్గొనేందుకు డాక్టర్లందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారని వెల్లడించారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ జాన్ షాహిద్, డాక్టర్ అస్లాం, డాక్టర్ సందీప్, డాక్టర్ ప్రదీప్, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

శరణాలయంలో బాలలకు అన్నదానం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్ పరిధిలోని చిన కాకాని షైన్ ఆనంద శరణాలయంలో బాలలకు గురువారం అన్నదానం నిర్వహించారు. శరణాలయం నిర్వాహకులు సంధ్యారాణి మాట్లాడుతూ మంగళగిరిలోని ప్రథమ ఎంబీబీఎస్ వైద్యులు డాక్టర్ అట్లూరి గోపాలకృష్ణమూర్తి ధర్మపత్ని అట్లూరి జయలక్ష్మి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శరణాలయంలో బాలలకు అన్నదానం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నే సూర్యాజీరావు, డాక్టర్ ఆలూరి ప్రసాద్, డాక్టర్ గోలి రామ్మోహనరావు, నిమ్మగడ్డ దినకర్, అన్నే వివేకానంద, అట్లూరి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐడియా ల్యాబ్స్ ఆధ్వర్యంలో గురువారం సీఎస్ఈ–డీఎస్ విభాగం విద్యార్థులకు డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐడియా ల్యాబ్స్ సీఈవో పంకజ్ దివాన్, అమెజాన్ డిజైన్ థికింగ్ అనలిస్ట్ శ్రీకాంత్‌లు హాజరయ్యారు. డిజైన్ థింకింగ్‌లో మైండ్ మ్యాపింగ్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. మలినేని ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు ఇన్నోవేటివ్ వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకుని కెరీర్‌ను మెరుగు పరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, డీఎస్ హెచ్‌వోడీ హరికృష్ణ, డీన్ రమేష్ పాల్గొన్నారు.